క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీఎం కప్–2024 జిల్లాస్థాయి జూడో పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారు. విద్యార్థులు సీహెచ్ శ్రావణ్, కె.సాయితేజ్, కె.రణధీర్ వివిధ క్రీడల్లో మొదటిస్థానంలో నిలిచి ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్‌కుమార్, ఎంఈఓ రాంధన్, పాఠశాల అధ్యాపక బృందం అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కమలాపూర్ : మండలంలోని వంగపల్లి–లక్ష్మీపూర్ గ్రామాల నడుమ పరకాల–హుజూరాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చెర్లపల్లికి చెందిన శనిగరపు పోశెట్టికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెర్లపల్లికి చెందిన పోశెట్టి తన భార్యతో కలిసి వంగపల్లి నుంచి చెర్లపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో లక్ష్మీపూర్ గ్రామ శివారులోకి వెళ్లగానే రాంగ్‌రూట్‌లో ఎదురుగా మొరం లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ పోశెట్టి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పోశెట్టికి తీవ్ర గాయాలు అయ్యాయి. హుటాహుటిన 108 ద్వారా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా పోశెట్టి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

'ఆరోగ్యమ్మ' దాతృత్వం



ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న గోపు ఆరోగ్యమ్మ–రఫాయేల్‌రెడ్డి దంపతులు దాతృత్వాన్ని చాటుకున్నారు. అదే పాఠశాలకు లక్ష రూపాయల విలువచేసే 18 డ్యూయల్ డెస్కులను అందించారు. కాగా ఎంఈఓ పులి ఆనందం, పాఠశాల హెచ్ఎం పింగిళి రజిత, ఏఏపీఎస్ చైర్మన్ మహబూబీ, శేషగిరి, నర్సింహారెడ్డి, అశోక్ కుమార్, రఫీ, కుటుంబరావు, శ్రీనివాస్ గోపు ఆరోగ్యమ్మ దంపతులను అభినందించి సత్కరించారు.

వేణుగోపాల ప్రసాద్‌కు సన్మానం



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన వావిలాల వేణుగోపాల ప్రసాద్ రాష్ట్ర పద్మశాలి సంఘం ఆర్గనైజర్ సెక్రటరీగా ప్రమాణస్వీకారం చేయగా పెద్దకోడెపాక పద్మశాలి సంఘం సభ్యులు ఆయనను సోమవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలో అత్యున్నత స్థానంలో వేణుగోపాల ప్రసాద్‌కు అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వీరయ్య, బొద్దుల మొగిలి, మాచర్ల రవి, చందనాల రాజేందర్, దాసరి రవి, వావిలాల రాజేందర్, మహేశ్వరం శంకర్, రంగు రాజేష్, పల్నాటి జలేందర్, రమేశ్, రాకేష్, రమేశ్, రాజు, శ్రీను, భాను పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ టీచర్, ఎల్ఐసీ సీఎం క్లబ్ మెంబర్ కోమటి వీరస్వామి మృతి చెందగా సోమవారం ప్రథమ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా లియాఫీ పరకాల అధ్యక్షుడు బూర బాబు, గౌరవ అధ్యక్షుడు ఆకుల రవీందర్, డివిజన్ ఉపాధ్యక్షుడు దేశిని రాజేశం గౌడ్, బ్రాంచ్ కోశాధికారి శ్రీనివాస్, సెక్రటరీ పింగిలి దేవేందర్‌రెడ్డి, కుమారస్వామి, రాజేశ్వరరావు, లియాఫీ బ్రాంచ్ అధ్యక్షుడు మేముల కుమారస్వామి, జాయింట్ సెక్రటరీ నామాల రమేశ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

బాలుడి అప్పగింత

ఆత్మకూరు : తప్పిపోయిన బాలుడి ఆచూకీ తెలుసుకుని వారి తల్లిదండ్రులకు అప్పగించారు ఆత్మకూరు పోలీసులు. సీఐ సంతోశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ కాశిబుగ్గకు చెందిన 11 ఏళ్ల బాలుడు గడ్డం లక్ష్మణ్ మండలంలోని గుడెప్పాడ్ జంక్షన్ వద్ద పోలీస్ సిబ్బందికి కనిపించాడు. ఈ మేరకు అతడిని వివరాలు అడుగగా వరంగల్ అని చెప్పాడన్నారు. పోలీస్ సిబ్బంది వరంగల్ పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ క్రాంతి సోమవారం రాత్రి కాశిబుగ్గలోని బాలుడి ఇంటికి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

గుంత.. వాహనదారులకు చింత

- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహిస్తున్న ప్రయాణికులు



కంఠాత్మకూరు హనుమాన్ గుడి మలుపు వద్ద ఏర్పడిన గుంత

నడికూడ : చిన్న గుంతే కాని తరుచూ ప్రమాదాలకు కేరాఫ్‌గా మారుతోంది. పలుమార్లు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడి ఆస్పత్రుల పాలైనా అధికారులకు చలనం కలగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. పరకాల–అంబాల ప్రధాన రహదారి కంఠాత్మకూరు హనుమాన్ గుడి మలపు వద్ద కొన్ని రోజుల క్రింతం రోడ్డుకు అడ్డుగా పైపులైన్ కోసం తవ్వి మట్టితో పూడ్చారు. కానీ మళ్లీ గుంత భారీగా ఏర్పడడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయంలో గుర్తించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. కాగా ఇటీవల పరకాల నుంచి వయా అంబాల ఎర్రగట్టు గుట్ట వరకు నాలుగు లైన్ల రోడ్డు మంజూరు కావడంతో ఎలాగో రోడ్డు విస్తీర్ణ పనులు జరుగుతాయని, ఇలాంటి ప్రమాదాకరంగా ఉన్న గుంతలను పూడ్చివేస్తారని భావించినా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి తాత్కాలికంగా గుంతను పూడ్చివేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



నేను ప్రతిరోజు కంఠాత్మకూరు నుంచి పరకాలకు వెళ్తుంటాను. జాగ్రత్తగా బండి నడుపుతాను. ఏమరపాటుగా ఉన్నామంటే కచ్చితంగా గుంతలో పడే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలి.

– వెల్లంకి వేణుగోపాల్, కంఠాత్మకూరు

రాత్రివేళల్లో ఇబ్బందులు



ఈ దారికి కొత్తగా వచ్చే వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిందే. ఆదమరిస్తే ప్రమాదానికి గురవుతారు. కొకొండ నుంచి నిత్యం హనుమకొండకు ఆటోలు, ఇతర వాహనదారులు వెళ్తుంటారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి గుంతను పూడ్చాలి.

– మహబుబ్‌పాషా, కొకొండ

క్రిస్మస్ వేడుకలు సంతోషంగా జరుపుకోవాలి



పులుకుర్తిలో నిర్వహించిన యూత్ క్రిస్మస్ వేడుకలు

దామెర : క్రిస్మస్ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని మాజీ ఉపసర్పంచ్, బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు మెంతుల రాజు కోరారు. మండలంలోని పులుకుర్తి తెలుగు బాప్టిష్టు చర్చిలో యూత్ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఈనెల 25వ తేదీన క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులు కుటుంబ సమేతంగా ఆనందోత్సవాల నడుమ వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక సంఘ కాపరి రెవరెండ్ మారపల్లి జాన్సన్‌ప్రీతి, సభ్యులు గోవిందు ఆనంద్, దయాకర్, సుగుణాకర్, సుధాకర్, రమేశ్, యువకులు రాకేష్, సేవాగ్, సిద్ధార్థ పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రం సమీపంలోని ఏకశిలా పాఠశాలలో వేడుకలు నిర్వహించగా డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ మణికుమార్, స్టాఫ్ ఇన్‌చార్జ్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం



పరకాల : అన్నం పెట్టే రైతన్న దేశానికి వెన్నముక అని పట్టణంలోని బిట్స్ పాఠశాల ప్రిన్సిపాల్ యుగేందర్ అన్నారు. రైతు దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ యుగేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామాల్లోని పంటపొలాల్లో పర్యటించి పంటసాగు కోసం రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకున్నారు. వ్యవసాయం చేస్తున్న యువ రైతులను బిట్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యుగేందర్ మాట్లాడుతూ.. క్రిమిసంహారక మందుల వాడకం, దిగుబడి పెరుగేందుకు రసాయనాల వాడటం వలన రైతులకు ఆర్థికభారం అవుతున్నప్పటికీ దిగుబడి కూడా తక్కువగా వస్తుందన్నారు. కాబట్టి విద్యార్థులు, యువత సేంద్రియ వ్యవసాయం కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊరుగొండ రైతుకు భూమిరత్న పురస్కారం



దామెర : మండలంలోని ఊరుగొండకు చెందిన రైతును భూమిరత్న పురస్కారం వరించింది. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్‌లో రైతు సహాయ వేదిక సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చెల్పూరి వైకుంఠం వ్యవసాయంలో చేస్తున్న వినూత్న సాగు విధానం, ప్రయోగాలను గుర్తించి భూమిరత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అనంతపూర్ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేతులమీదుగా ప్రదానం చేశారు.

క్రషర్లతో పంటసాగుకు ఇబ్బంది

- రైతు ఆవేదన



రాళ్లను చూపుతున్న రైతు దంపతులు

ఆత్మకూరు : వ్యవసాయ భూముల సమీపంలో ఉన్న క్రషర్ల కారణంగా వ్యవసాయం చేయలేకపోతున్నామని మండలంలోని మల్కపేటకు చెందిన రైతు యాట సంపత్ ఆవేదన వ్యక్తం చేశారు. తన భూమి సమీపంలో ఉన్న వివిధ క్రషర్ల నుంచి దుమ్ము, రాళ్ళు పడుతున్నాయని, దీంతో నష్టం కలుగుతుందని తెలిపారు. క్రషర్ల కారణంగా ప్రతీ ఏడాది తీవ్రంగా నష్టపోతున్నానని వాపోయారు. క్రషర్ యజమానులు నైతిక బాధ్యత వహించి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పలుమార్లు ఆర్డీఓ, తహసీల్దార్‌కు వినతిపత్రాలు ఇచ్చానని, అయినా స్పందన లేదని తెలిపారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

ఉత్సాహంగా స్వయంపాలన దినోత్సవం



గురువులుగా వ్యవహరించిన విద్యార్థులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఒక రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.నిర్మల, ఉపాధ్యాయులు రాజేందర్, శిరీష, రఘుపతి, సదాశివరెడ్డి, మాధవి, ప్రకాశ్, మహేందర్‌రెడ్డి, ఉమాదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'సఖి' సేవలను వినియోగించుకోవాలి



వేలేరు : మహిళలు సఖి సెంటర్ సేవలను వినియోగించుకోవాలని లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ హరిత అన్నారు. సఖి కేంద్రం ద్వారా అందించే సేవలపై సోమవారం ఏపీఎం, సీసీలు, వీఓ, మహిళా సంఘం సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళల సమస్యల పరిష్కారం కోసం సఖి కేంద్రం నిరంతరం పనిచేస్తుందని అన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి కేంద్రం కొనసాగుతుందన్నారు. మహిళలకు కౌన్సెలింగ్, వైద్యం, పోలీస్, తాత్కాలిక వసతి, న్యాయ సహాయంపై మహిళలకు అవగాహన కల్పించారు. పనిచేసే చోట లైంగిక వేధింపులు, గృహహింస చట్టాలను వివరించారు.

గుడుంబా విక్రయిస్తే కేసులు : సీఐ



స్వాధీనం చేసుకున్న గుడుంబాతో సీఐ సంతోశ్

ఆత్మకూరు : అమాయకుల ప్రాణాలను హరిస్తున్న గుడుంబాను విక్రయించినా, తయారీ చేసినా కేసులు నమోదు చేస్తామని సీఐ సంతోశ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో పోలీసుల తనిఖీల్లో భాగంగా బయ్య సాంబలక్ష్మి వద్ద నుంచి 16లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సాంబలక్ష్మిని అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. గుడుంబా తాగడం వలన అనారోగ్య సమస్యలు వస్తాయని, గుడుంబా అలవాటు ఉన్నవారు మానుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బూత్ కమిటీలతోనే పార్టీ బలోపేతం



నవీన్‌కు నియామక పత్రం అందజేస్తున్న మొగిలి

శాయంపేట : బూత్ కమిటీలతోనే పార్టీ బలోపేతం అవుతుందని బీజేపీ ఎన్నిల రిటర్నింగ్ జిల్లా సహాయ అధికారి రాయరాకుల మొగిలి అన్నారు. మండల కేంద్రలోని 305, 306, 307, 309 బూత్ కమిటీలను సోమవారం మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బూత్ అధ్యక్షులుగా కడారి చంద్రమౌళి, బాసాని నవీన్, బత్తుల రాజేష్, మేకల సుమన్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు నియామకపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కొత్తకొండ జాతర ఏర్పాట్లపై నేడు సమావేశం

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి జాతర బ్రహ్మోత్సవాలు జనవరి 10న స్వామివారి కల్యాణంతో ప్రారంభం కానున్న నేపథ్యంలో నేడు కొత్తకొండలో జాతర ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరేశం తెలిపారు. పోలీస్, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, నీటి సరఫరా, వైద్య, రోడ్డు, అగ్నిమాపక, ఆర్టీసీ, అబ్కారీ, దేవాదాయశాఖ అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానించినట్లు ఈఓ కిషన్‌రావు పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- ఆటో యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్

పరకాల : ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రచురించిన విధంగా ఆటో డ్రైవర్లకు ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆటో యూనియన్ల జేఏసీ పరకాల మండల అత్యవసర సమావేశం సోమవారం పట్టణంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు నష్టం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ వాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. ఆటో కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రచురించారని గుర్తు చేశారు. కానీ ఏడాదికి కాకుండా నెలకు రూ. 12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.8వేల ఇన్సూరెన్స్‌ను వెయ్యికి తగ్గించాలని కోరారు. అనంతరం జేఏసీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బొట్ల భాస్కర్, కో ఇన్‌చార్జ్‌గా చిలువేరు నరేష్‌ను నియమించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే సకాలంలో పూర్తిచేయాలి

- ఎంపీడీఓ గుండె బాబు



పశువుల పాక నిర్మాణానికి ముగ్గు పోస్తున్న ఎంపీడీఓ గుండె బాబు

కమలాపూర్ : ఇందిరమ్మ ఇళ్ల సర్వే సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీఓ గుండె బాబు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని ఉప్పల్‌లో కొనసాగుతున్న సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. అంతకుముందు ఈజీఎస్ నిధులతో నాయిని పుష్ప నిర్మిస్తున్న పశువుల పాకను పరిశీలించి, పుల్ల లలిత నిర్మించుకోనున్న పశువుల పాకకు ముగ్గు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 18,618 మంది ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తుల పరిశీలనకు 33 బృందాలకు లాగిన్స్ ఇచ్చి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. లాగిన్ ఉన్న ప్రతి ఒక్క బృందం ప్రతి రోజు విధిగా 25 కుటుంబాలను సర్వే చేయాలని అన్నారు. అలాగే ప్రతీ గ్రామంలో 30 మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని, లేనిపక్షంలో ఉపాధి హామీ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని ప్లాంటేషన్లలో నూరు శాతం మొక్కలు ఉండే విధంగా చూడాలని, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. అన్ని ప్లాంటేషన్లలో సంరక్షుడిని నియమించి గ్రామపంచాయతీ ట్రాక్టర్ల ద్వారా మొక్కలకు నీళ్లు పోయాలని, పశువుల బారిన పడకుండా మొక్కలను రక్షించేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. నర్సరీల సరంక్షణపై నిర్లక్ష్యం వహించే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో ఈజీఎస్ ఏపీఓ రమేశ్, ఈసీ కార్తీక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌సీఈఆర్‌టీలో గణిత పరిశోధన పత్రం ఎంపిక



విద్యాశాఖ డైరక్టర్ నరసింహరెడ్డి చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకుంటున్న చిదురాల శ్రీనివాస్

ఐనవోలు : రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణా సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ)లో మండలంలోని ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చిదురాల శ్రీనివాస్ సమర్పించిన పరిశోధన పత్రం డిజిటల్ రిసోర్సెస్ ఇన్ మ్యాథమేటిక్స్ లెర్నింగ్‌కు ఎంపికైంది. ప్రతి ఏడాది మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వం శ్రీనివాస రామానుజన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా గణిత ఉపాధ్యాయులు, గణిత పరిశోధకులు, గణిత శాస్త్ర నిపుణులకు పరిశోధన పత్రాల సమర్పణ, సెమినార్ పోటీలు నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఔత్సాహిక గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 పరిశోధన పత్రాలను ఎంపిక చేయగా ఒంటిమామిడిపల్లి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సమర్పించిన పరిశోధన పత్రం డిజిటల్ రిసోర్సెస్ ఇన్ మ్యాథమేటిక్స్ లెర్నింగ్‌కు ఎంపిక అవడం అభినందనీయమని ఎంఈఓ ఆనందం పేర్కొన్నారు. శనివారం ఎస్‌సీఈఆర్‌టీలో డైరక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఈవీ నరసింహారెడ్డి, ఎస్‌సీఈఆర్‌టీ డైరక్టర్ రమేశ్ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌కు ప్రశంసాపత్రం అందించి అభినందించినట్లు తెలిపారు. కాగా సోమవారం స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్ఎం సదానందం, ఏఏపీసీ చైర్మన్ సకినాబీ, పెండ్లి నవీన్, గోనె రాజు, కరుణాకర్, రాజు, రఫీ ఉపాధ్యాయుడు చిదురాల శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

- ఏసీపీ సతీశ్‌బాబు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ సతీశ్‌బాబు

దామెర : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఏసీపీ సతీశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. రౌడీషిటర్లు ఎలాంటి గొడవల్లో తలదూర్చొద్దని అన్నారు. అనవసరమైన వ్యవహారాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. చట్టాన్ని ప్రతిఒక్కరూ గౌరవించాలని అన్నారు. ఆయన వెంట ఎస్సై కొంక అశోక్, ఏఎస్సైలు యాకయ్య, రమేశ్, సిబ్బంది ఉన్నారు.

రోడ్డుపై డివైడర్లే మినీ కల్లాలు..!



డివైడర్‌పై ఉంచిన ధాన్యం కుప్ప

ఆత్మకూరు : రోడ్డుపై ధాన్యం ఆరబోయడంతో సరిపెట్టుకున్న రైతులు ప్రస్తుతం రోడ్డు డివైడర్లను మినీ కల్లాలుగా భావించి నేరుగా ధాన్యం కుప్పలను ఏర్పాటు చేశారు. మండలంలోని అక్కంపేటలో ధాన్యం కుప్పలను డివైడర్లపై ఉంచడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఇదివరకు రోడ్లపై ధాన్యం ఆరబోసిన రైతులు.. ఏకంగా రోడ్డు డివైడర్లను మినీ కల్లాలుగా మార్చి ధాన్యం కుప్పలు కట్టారని, దీంతో రాత్రి వేళ ప్రయాణం ఇబ్బందిగా మారిందని ఆందోళన చెందుతున్నారు. అక్కంపేట రోడ్డు వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు అనుసంధానంగా ఉంటుందని, ఈ రోడ్డుపై నిత్యం మార్కెట్‌కు అధిక సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయని తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై ధాన్యం కుప్పలు ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. అధికారులు దృష్టిసారించి కుప్పలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

- టీఎస్ యూటీఎఫ్ నాయకులు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పరకాల : ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న విద్య, వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మేరుగు ప్రసన్న, జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీరా రాజారాం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి సోమవారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్గొండ జిల్లా కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 6వ విద్య, వైజ్ఞానిక మహాసభల్లో ప్రభుత్వ విద్యారంగంపై మేధావుల ఆధ్వర్యంలో చర్చ నిర్వహించడం జరుగుతుందన్నారు. రాబోయే కాలానికి ప్రభుత్వ విద్యారంగం, ఉపాధ్యాయుల అభ్యున్నతి కోసం తగిన సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అన్‌మ్యాన్డ్'ను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి

ఆత్మకూరు : అన్‌మ్యాన్డ్ కార్మికులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బూర వరుణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. హనుమకొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్‌మ్యాన్డ్ కార్మికులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమాన హక్కులు కల్పించాలన్నారు. సబ్‌స్టేషన్‌లో ఖాళీగా ఉన్న ఆపరేటర్ పోస్టులను ఐటీఐ అర్హత ఉన్న కార్మికులకు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అందుకు తగిన ఉత్వర్వులు జారీ చేయాలని కోరారు.